

ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ నాగరాజు

## ఓటు హక్కు వినియోగంపై బైక్‌ర్యాలీ

అందోల్, నవంబర్ 2 : 30న జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రిటర్నింగ్ అధికారి పాండు, నోడల్ అధికారి బాలాజీ అన్నారు. ఓటు హక్కు వినియోగం, పోలింగ్ తేదీపై ఓటర్లకు అవగాహన కల్పించడంలో భాగంగా గురువారం ఉదయం క్లాక్ టవర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొన్ని ఓటు హక్కుపై అవగాహన కల్పించగా.. సీఐ నాగరాజు జెండాను ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంటోని, డీటీ మధుకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎంఈవో కృష్ణ, ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్సై అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

**నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి**

30నుంచి శాసనసభ ఎన్నికలు జరుగనుండగా నేటి నుంచి అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి పాండు తెలిపారు. ఉదయం 10 నుంచి 5గంటల వరకు అభ్యర్థులు నామినేషన్లు అందించేందుకు సమయం ఉంటుందని ఆలోపు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు అందజేయాలన్నారు. రిటర్నింగ్ కార్యాలయం వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నేటి నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు సమర్పించే అవకాశం ఉటుందని తెలిపారు.

## పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ



సిర్గాపూర్ : పోలీసు స్టేషన్‌ను సందర్శించి ఎస్పీ రూపేశ్

సిర్గాపూర్/ కల్హేర్ నవంబర్ 2 : నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కల్హేర్, సిర్గాపూర్ మండల కేంద్రాలకు జిల్లా ఎస్పీ రూపేశ్ గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. క్రైం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వచ్చే సార్వత్రిక ఎన్నికల బందోబస్తు నిర్వహణ, రూట్లు, సమస్యాత్మక గ్రామాలు, పోలింగు స్టేషన్‌ల సంఖ్య, ఏర్పాట్లపై విచారించారు. పోలింగ్ నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానితులను విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పోలింగు కేంద్రాలను పరిశీలించారు. ఈయన వెంట నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, కంగ్టి సీఐ జక్కుల హన్మంతు, ఎస్ఐలు మహిపాల్‌రెడ్డి, వెంకటేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

**అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు**

కంగ్టి, నవంబర్ 2: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్ అన్నారు. గురువారం ఆయన కంగ్టి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని దెగుల్‌వాడి వద్ద కర్ణాటక సరిహద్దులో చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ. 50వేలకు మించి నగదు ఉంటే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా చూసుకోవాలని స్థానిక అధికారులకు సూచించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావాళిని పాటించాలన్నారు.

అనంతరం కర్నాటక సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను పరిశీలించి, అక్కడ డ్యూటీలో ఉన్న సిబ్బందితో పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట నా రాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, కంగ్టి సీఐ హన్మంతు, ఎస్సై విశ్వజన్, సిబ్బంది ఉన్నారు.

# కేసీఆర్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- స్టేట్ ట్రేడ్‌ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి
- అందోల్ మండలంలో జోరుగా సాగుతున్న ఎన్నికల ప్రచారం

అందోల్, నవంబర్ 2 : ప్రతి పేదవాడు సంతోషంగా ఉండాలంటే అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ట్రేడ్‌ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని చింతకుంట తదితర గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుపై ఓటేసి క్రాంతికిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. మండల వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో స్టేట్ మార్కుఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ బాలయ్య, సర్పంచ్ పద్మనాభరెడ్డి, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి, ఉపసర్పంచ్ రాఘువరెడ్డి పాల్గొన్నారు.

**మైనార్టీల కోసం బీఆర్ఎస్ కృషి**

జహీరాబాద్, నవంబర్ 2 : ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ఎన్నికల్లో ఓట్లు వేసి ఆశీర్వదించాలని రైల్వే బోర్డు సభ్యుడు, బీఆర్ఎస్ నాయకులు షేక్ ఫరీద్ కోరారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లోని ముస్లింలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాణిక్‌రావుకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. సీఎం కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. సమావేశంలో జహీరాబాద్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు సయ్యద్ మోహినోద్దీన్, బీఆర్ఎస్ నాయకులు అక్బర్, మొహిజ్ పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలి**

హత్నూర, నవంబర్ 2 : ప్రజాసంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ కేవీ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రావు కోరారు.గురువారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి మద్దతుగా ఆటోడ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేసి సునితాలక్ష్మారెడ్డికి ఓటువేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో సునీతాలక్ష్మారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలువడం ఖాయమన్నారు. ఆటోడ్రైవర్లకు సునితమ్మ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సబ్సిడీ హెల్త్‌కార్డులను పంపిణి చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు సంతోష్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



అందోల్ : చింతకుటంటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి



జహీరాబాద్ : శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన ముస్లీంల సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే బోర్డు సభ్యులు షేక్ ఫరీద్

# కాంగ్రెస్ వీడి బీఆర్ఎస్‌లోకి..

హత్నూర, నవంబర్ 2 : మండలంలోని బడంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు రవీందర్‌తో పాటు కార్యకర్తలు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునితాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పన్యాల సర్పంచ్ శ్వేతబుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరికలు**

కంగ్టి, నవంబర్ 2: కంగ్టి మండలం దెగుల్‌వాడి, ముకుంద్‌నాయక్‌తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం రాత్రి నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగీతావెంకట్‌రెడ్డి, దెగుల్‌వాడి సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ గోవింద్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ముజామీల్, పవన్‌పాటిల్, దిలీప్‌పాటిల్, హన్మారెడ్డి, గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



హత్నూర : కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రవీందర్



కంగ్టి : డీలర్ శంకర్‌కు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



రాజుపాటిల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

కంగ్టి, నవంబర్ 2 : జమ్గి(కె) గ్రామానికి చెందిన కంగ్టి మండల మాజీ జడ్పీటీసీ రాజు పాటిల్‌ను గురువారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో పరామర్శించారు. దవాఖానలో వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో సంప్రదించి రాజుపాటిల్‌కు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట ఎంబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ రోషన్‌రెడ్డి ఉన్నారు.

## గంజాయి మొక్కలు ధ్వంసం

మునిపల్లి,నవబంర్ 2 : పత్తి పంటలో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం అందుకున్న సంగారెడ్డి ఎక్సైజ్ అధికారులు పత్తి పంటపై మెరుపు దాడులు నిర్వహించి మొక్కలను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసిన ఘటన గురువారం మండలంలోని కంకోల్‌లో చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంకోల్ గ్రామానికి చెందిన పెద్దాపురం చంద్రయ్య తండ్రి రాచప్ప తన భూమిలో పంటలో గంజాయి మొక్కలు సాగుచేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు దాడులు నిర్వహించి పత్తి పంటల్లోంచి గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని పూర్తిగా నిప్పు అంటించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మధుబాబు మాట్లాడుతూ గంజాయి పంటలు పండించే వారికి ప్రభుత్వం అందించే పథకాలు వర్తించవన్నారు. గంజాయి పంటలు పండించే వారు ఎంతటివారైనా కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. గంజాయి పండించినా, గంజాయి అమ్మినా, గంజా యి అమ్మేందుకు సహకరించే వారు ఎవ్వరైనా సరే కేసులు చేసి జైలుకు పంపించడంలో వెనుకాడబోమన్నారు. కంకోల్ గ్రామంలో గంజాయి పండిస్తూ పట్టుబడిన చంద్రయ్యను అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై స్వాతి, సిబ్బంది ఉన్నారు.



కంకోల్‌లో గంజాయి పండిస్తున్న రైతు చంద్రయ్యను అదుపులోకి తీసుకున్న సీఐ మధుబాబు